సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 19 । జనవరి । 2023



హుండీల లెక్కింపు

కైకలూరు: కలిదిండి పాతాళ భోగేశ్వర స్వామి హుండీలను బుధవారం లెక్కించగా రూ.6,35,833 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.



నిత్యాన్నదానానికి విరాళం

పాలకోడేరు: భీమవరం మావుళ్లమ్మ ఆలయం నిత్యాన్నదాన పథకానికి పాలకోడేరు మాజీ సర్పంచ్ ఆళ్ల అప్పలరాజు రూ. లక్ష విరాళంగా అందజేశారు.



శ్రీవారి ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం తాడేపల్లిగూడెంకు చెందిన వేమూరి సుబ్రహ్మణ్యం రూ. 1,00,000 విరాళంగా అందజేశారు.

రేషన్ ఇక ఉచితం

- ఉమ్మడి జిల్లాలో ప్రతి నెల 16,474 మెట్రిక్ టన్నుల పంపిణీ
- 751 వాహనాల ద్వారా ఇంటి వద్దకే బియ్యం
- 11.78 లక్షల కార్డుదారులకు లబ్ధి
- జిల్లాలో ఏడాది పాటు కొనసాగింపు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రేషన్ బియ్యాన్ని ఇక పూర్తి ఉచితంగా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంటవరకూ కిలోకి రూపాయి తీసుకునేవారు. ఇక నుంచి పూర్తి ఉచితంగా అందిస్తారు. ఇప్పటికే సంక్షేమ పథకాలతో భరోసా ఇస్తున్న సర్కారు నూతన సంవత్సరం నుంచి జిల్లాలో ఉచిత రేషన్ అమలు చేయనుంది. ప్రతి నెల 16,474 మెట్రిక్ టన్నులు ఉచితంగా పంపిణీ చేయనున్నారు. రేషన్ కార్డుదారులకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున రేషన్ బియ్యాన్ని అందిస్తూ కిలో ఒక్క రూపాయికే ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఇక నుంచి నూతన సంవత్సరంలో సంవత్సరం పాటు ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ఉచితంగా రేషన్ బియ్యాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రేషన్ వాహనాలు ద్వారా అందించే పంచదార, కందిపప్పుకు మాత్రమే డబ్బులు తీసుకోనున్నారు. కేజీ కందిపప్పుకు రూ.67, అరకిలో పంచదారకు రూ.17 తీసుకోవాలని, బియ్యం మాత్రం ఉచితంగానే అందించాలని ఆదేశించింది. ఈఏఏవై కార్డుదారులకు కేజీ పంచదార రూ.13.50కే అందించాలని ప్రభుత్వం ఆదేశించింది.

నూతన సంవత్సర కానుకగా.. నూతన సంవత్సర కానుకగా అందించే ఈ బియ్యం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏలూరు జిల్లాలో 6,42,526 కార్డులకు గాను 17,87,981 మందికి అందిస్తారు. అదే విధంగా పశ్చిమగోదావరి జిల్లాలో 5,36,423 కార్డులకు గాను 15,06,921 మంది ప్రజలకు ఒక్కొక్కరికి 5 కేజీల చొప్పున అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16,474 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రతి నెల ఉచితంగా ఆయా కార్డుదారులకు అందిస్తున్నారు. **ఏలూరు జిల్లాలో 1,164 రేషన్ దుకాణాల ద్వారా 408 రేషన్ వాహనాలు, అదే విధంగా పశ్చిమగోదావరి జిల్లాలో 1011 రేషన్ దుకాణాల ద్వారా 343 రేషన్ వాహనాలు కార్డుదారుల ఇంటి వద్దకే బియ్యాన్ని తీసుకువెళ్ళి ఉచితంగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది.**


ఇంటి వద్దకే రేషన్ పంపిణీ (ఫైల్)

పేద ప్రజల్లో ఆనందం

ప్రభుత్వం ఇంటింటికి వాహనాల ద్వారా రేషన్ సరఫరా చేయడంతో పాటు నూతనంగా అందించే రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందించడం పట్ల పేదలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమపై భారం పడకుండా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రేషన్ దుకాణాల చుట్టూ తిరుగుతూ వరుసలో నిలబడి రేషన్ డీలర్ ఇచ్చే బియ్యం కోసం ఎదురు చూడాల్సి వచ్చేదని, ప్రస్తుతం తమకు ఆ బాధలు తప్పాయంటున్నారు. ఇంటికి తీసుకువచ్చి అందించే బియ్యాన్ని సైతం ఉచితంగా ఇవ్వడం పట్ల కార్డుదారులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు.

ఇక నుంచి ఉచితంగా అందిస్తాం



ప్రభుత్వ నిర్ణయంతో కార్డుదారులకు బియ్యం ఉచితంగా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇతర సరుకులకు సొమ్ములు చెల్లించాలి. ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా కార్డుదారులకు బియ్యం ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. మిగిలిన సరుకులకు సొమ్ములు చెల్లించాల్సి ఉంది.

– పీ.అరుణ్‌బాబు, జాయింట్ కలెక్టర్, ఏలూరు జిల్లా

ఇప్పటికే వాహనాల ద్వారా సరఫరా



ఇప్పటికే రేషన్ దుకాణాల నుంచి వాహనాల ద్వారా ప్రజల వద్దకే వెళ్ళి రేషన్ అందిస్తున్నాం. ఈ నేపథ్యంలో నూతనంగా ప్రభుత్వం ఉచితంగా బియ్యాన్ని అందించాలని ఆదేశాలు జారీ చేయడంతో ఆ మేరకు బియ్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. సంవత్సరం పాటు ఉచిత బియ్యం పంపిణీ ప్రక్రియ సాగుతుంది.

– ఈ.మురళీ, జాయింట్ కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

వ్యవసాయానికి పెద్ద పీట

వ్యవసాయ శాఖ మంత్రి కాకాని


పాలిలో ఆర్బీకేను ప్రారంభిస్తున్న మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతు భరోసా కేంద్రాల్ని ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. అత్తిలి మండలం పాలి గ్రామంలో రూ. 25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని, రూ.25.3 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.16 లక్షలతో నిర్మించిన రెండు అంగన్‌వాడీ కేంద్రాలను పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిలు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయరంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు నిరంతరం రైతులకు సేవలు అందించాలన్నారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన అన్ని సేవలు అందిస్తున్నామన్నారు. దళారులు లేకుండా ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిపి, ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధర రైతుల ఖాతాలో సకాలంలో జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జేవీ మురళి, అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అద్దాల జానకి, సర్పంచ్ కేతాగౌరీ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సచివాలయాల తనిఖీ


అత్తిలి సచివాలయంలో ఆరా తీస్తున్న జేసీ

అత్తిలి: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో సచివాలయ సిబ్బంది కీలకపాత్ర పోషించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ జేవీ మురళి అన్నారు. బుధవారం అత్తిలి మండలంలోని స్కిన్నెరపురం, కంచుమర్రు, మంచిలి, అత్తిలి సచివాలయాలను జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరుపట్టిక, సంక్షేమ పథకాల క్యాలెండర్ వంటి అంశాలను పరిశీలించారు. ఈ నెలలో ప్రభుత్వం అమలుచేసే పథకాలకు సంబంధించి లబ్ధిదారుల జాబితాను సోషల్ ఆడిట్ చేశారా? అని పర్యవేక్షించారు. ఆయా నెలల్లో ప్రభుత్వం అమలుచేసే పథకాల అర్హుల జాబితాను ప్రతినెలా సచివాలయంలో ప్రదర్శించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఈకేవైసీ నమోదులో ఆందోళన అవసరం లేదు


భీమవరంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న రవివర్మ

సాక్షి, భీమవరం: రిటైర్డ్ ఉద్యోగులు ఈకేవైసీ నమోదులో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భీమవరం సబ్‌ట్రెజరీ అధికారి రవివర్మ అన్నారు. బుధవారం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన ఈకేవైసీ నమోదుపై అవగాహన కల్పించడానికి ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈకేవైసీ నమోదుకు సమయం మించిపోలేదన్నారు. ఆధార్ నంబర్‌కు లింకైన ఫోన్ నంబర్‌ను ముందుగా సరిచూసుకుని సరైన నెంబర్ కాకపోతే ఆధార్ కేంద్రంలో సరిచేయించుకోవాలన్నారు. నమోదు విషయంలో సమస్యలుంటే ఎస్టీవో కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. సమావేశంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాతల జేమ్స్, డాక్టర్ ఎస్ఎస్ఎన్ రాజు, ఉపాధ్యక్షుడు ఎస్.అప్పలరాజు, సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలపై ప్రజాభిప్రాయ సేకరణ

సాక్షి, భీమవరం: రానున్న ఆర్థిక సంవత్సరానికి అమలుచేసే విద్యుత్ చార్జీలపై ఈ నెల 19 నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు జస్టిస్ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో ఏపీ ఈఆర్సీ అధికారులతోపాటు రాష్ట్ర ఇంధనశాఖ ఈపీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్, సీపీడీసీఎల్ అధికారులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో వినియోగదారులు తమ అభ్యంతరాలు, సలహాలు తెలపవచ్చని తెలిపారు.

హనోక్ వర్ధన్‌కు ఇండియా ప్రైడ్ అవార్డు


యాళ్ల హనోక్ వర్ధన్

సాక్షి, భీమవరం: భీమవరం పట్టణం గునుపూడికి చెందిన యాళ్ల హనోక్ వర్ధన్‌ను ఇండియా ప్రైడ్ అవార్డు వరించింది. విద్యను ప్రోత్సహించడంతోపాటు వృద్ధులు, పేదలకు అందిస్తున్న సేవలకు న్యూఢిల్లీలోని సేవ్ హ్యూమానిటీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పవర్ స్పెట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఈ అవార్డును ప్రకటించింది. ఈ నెల 26న గణతంత్రదినోత్సవ వేడుకల్లో అవార్డు అందుకోనున్నట్లు చెప్పారు.

జీడిమామిడిపై జాతీయ సమావేశం

తాడేపల్లిగూడెం: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలో జాతీయ స్థాయిలో జీడిమామిడి సాగు అభివృద్ధిపై మూడు రోజుల పాటు ఉద్యాన వర్సిటీలోని ఉద్యాన పరిశోధన స్థానంలో గురువారం నుంచి సమావేశాలు నిర్వహించనున్నట్లు ఉపకులపతి టి.జానకీరామ్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ పరిశోధన స్థానాలలో జీడిమామిడి సాగు అభివృద్ధిపై జరిగిన పరిశోధన ఫలితాలు సమావేశంలో చర్చిస్తారని వీసీ తెలిపారు.

24 వరకూ రోడ్డు భద్రతా వారోత్సవాలు


జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఈ నెల 18 నుంచి 24 వరకు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అదనపు ఎస్పీ సుబ్బరాజు, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి టి.ఉమామహేశ్వరరావుతో కలిసి 34వ జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాల పోస్టర్, కరపత్రాలను బుధవారం కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని దీని ద్వారా ప్రయాణ సమయంలో తలకు గాయం కాకుండా, మరణాలు సంభవించకుండా ఆపగలమని తెలిపారు. రవాణా శాఖ అధికారులు కళాశాలకు వెళ్లి విద్యార్థులకు హెల్మెట్, సీట్‌బెల్ట్‌లను వాడడం వలన కలిగే లాభాలను తెలియజేయాలని చెప్పారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాక్సీ, బస్సు, లారీ వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు నిర్వహించాలని తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపరాదని హెచ్చరించారు. వాహనాలకు రేడియం స్టిక్కర్లను అతికించాలని తెలిపారు. రోడ్డు కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్లను తొలగించాలని, దీని ద్వారా ప్రమాదాలను నివరించగలమని తెలిపారు. డీటీసీ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నాసిరకం హెల్మెట్ వాడడం వల్ల లాభం లేదని, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ప్రకారం ఐఎస్ 4151 ఉన్నదే వాడాలని సూచించారు. ఈ వారోత్సవాల్లో భాగంగా సురక్షిత ప్రయాణానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ప్రజలంతా ఆనందంగా ఉండాలి


కె.ఇల్లిందలపర్రు గ్రామంలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కారుమూరి

ఇరగవరం: ప్రజలందరూ ఆనందంగా ఉండాలని గ్రామ దేవతను కోరుకున్నానని పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం రాత్రి ఇరగవరం మండలంలోని కె.ఇల్లిందలపర్రులో గ్రామ దేవతలు చల్లాలమ్మ, పెద్దింట్లమ్మ, కత్తవపాడు గ్రామంలో వేంచేసిన తిరుపతమ్మ, మారెమ్మ జాతర మహోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయనకు జాతర నిర్వాహకులు, కమిటీ సభ్యులు, నాయకులు, పూజారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో గ్రామ దేవతల పండుగలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని చెప్పారు. గతంలో స్థానికంగా ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం గ్రామాల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరూ కలిసిమెలిపి పండుగల్లో పాల్గొంటున్నారన్నారు. కె.ఇల్లిందలపర్రు సొసైటీ అధ్యక్షులు మల్లిరెడ్డి నాగార్జున నివాసం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో మంత్రి భేటీ అయ్యారు. కార్యక్రమంలో తణుకు మండలం పార్టీ అధ్యక్షులు పోలేపల్లి వెంకటప్రసాద్, ఇరగవరం మండల అధ్యక్షులు కొప్పిసెట్టి దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ మల్లిడి నాగవెంకట సత్యనారాయణ, నాయకులు సూరంపూడి కామేష్, గరికిపాటి సతీష్, వీరమల్లు ఫణీంద్ర, జవ్వాది సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేమన జయంతి


విశేష అలంకరణలో ఆరవల్లి యోగి వేమన

అత్తిలి: ఆరవల్లి గ్రామంలో శ్రీ యోగివేమన 98వ జయంతి ఉత్సవం బుధవారం కనుల పండువగా నిర్వహించారు. వెలగల దాసు వంశీయులు వేమనకు తెల్లవారు జామున గోస్తనీ నది స్నానం చేయించారు. వేమన మందిరాన్ని పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వేమనను దర్శించుకున్నారు, ఆలయ ప్రాంగణంలో భజన కీర్తనలు, సినీ సంగీత విభావరి నిర్వహించారు. బ్యాండు మేళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై వేమన చిత్రపటాన్ని ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. శ్రీయోగి వేమన పల్లకి కింద నుంచి తల్లిదండ్రులు తమ చంటి పిల్లలను దాటించారు. ఇలా చేయడం వల్ల పిల్లలకు ఆయుష్షు పెరుగుతుందనేది గ్రామస్తుల నమ్మకం. ఉత్సవాలకు హాజరైన వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు గృహోపకరణ, ఫ్యాన్సీ వస్తు దుకాణాల వద్ద సందడి నెలకొంది. వేమన జయంతి సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. దేశ విదేశాలలో ఉన్న వారు స్వగ్రామానికి చేరుకుని బంధుమిత్రులతో ఉత్సాహంగా గడిపారు. ఉత్సవాలను తిలకించేందుకు జిల్లాలో పలు ప్రాంతాలనుంచి పెద్దసంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆరవల్లి గ్రామానికి చెందిన ప్రముఖ సినీ దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి, నిర్మాత అచ్చిరెడ్డిలు వేమనను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వాలీబాల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ వెలగల అమ్మిరెడ్డి, కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

శునకాలకు అన్నదానం :

ఆరవల్లి వేమన జయంతి ఉత్సవాలలో అత్యంత ప్రాముఖ్యమైనది శునకాలకు అన్నదానం చేయడం. వివిధ రకాలైన పిండి వంటలను కావిళ్లతో తీసుకెళ్లి, గ్రామంలో తిరుగుతూ కనబడిన ప్రతీ శునకానికి వడ్డిస్తారు.


యోగి వేమనను దర్శించుకుంటున్న సినీ నిర్మాత అచ్చిరెడ్డి, దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి


శునకాలకు అన్నదానం చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

వేలం ద్వారా భారీ ఆదాయం

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపైకి వెళ్లే టోల్‌గేట్ నిర్వహణకు దేవస్థానం అధికారులు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా స్వామివారికి విశేష ఆదాయం సమకూరింది. రెండేళ్ల కాలానికి జరిపిన ఈ వేలంలో ఏడాదికి శ్రీవారికి రూ.1.70 కోట్ల ఆదాయం లభించింది. భీమడోలు మండలం పూళ్లకు చెందిన సొసైటీ చైర్‌పర్సన్, డీసీసీబీ డైరెక్టర్ కందులపాటి శ్రీనివాసరావు(రాజీలు) రూ. 1,70,10,000 లకు బహిరంగ వేలం ద్వారా ఈ హక్కును దక్కించుకున్నారు. చినవెంకన్న ఆలయ ఆవరణలో ఉదయం దేవస్థానం అధికారులు 2023–2025 గాను టోల్‌గేటు నిర్వహణ హక్కుకు బహిరంగ వేలాన్ని జరిపారు. రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ ఆమోదం తెలిపిన అనంతరం టోల్ నిర్వహణా బాధ్యతలను పాటదారుడికి అప్పగిస్తామని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

ఆర్టీసీకి పండుగే..

- సంక్రాంతికి రూ.42.48 లక్షల ఆదాయం
- జిల్లా వ్యాప్తంగా 160 ప్రత్యేక బస్సులు


ఆర్టీసీ ప్రత్యేక బస్సుల్లో భీమవరం బస్టాండ్ చేరుకున్న ప్రయాణికులు (ఫైల్)

భీమవరం(ప్రకాశం చౌక్): సంక్రాంతి పండుగ ఆర్టీసీకి మంచి ఆదాయం తీసుకొచ్చింది. పండుగకు ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు ప్రయాణికులు చక్కగా ఉపయోగించుకున్నారు. ఈ నెల 6 నుంచి 20 వరకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయగా పండుగ ముందు దూర ప్రాంతం నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికుల్ని గమ్యస్థానాలు చేర్చారు. తిరిగి ఊళ్లకు వెళ్లేవారు కూడా బస్సులు ద్వారా గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకుంటున్నారు. ఈ సంక్రాంతి పండగకు ప్రయాణికులు ఆర్టీసీల్లో ప్రయాణించడానికి ఆసక్తి చూపారు. జిల్లాలో నాలుగు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంచారు.

ప్రైవేట్ దోపిడీకి అడ్డుకట్ట

సంక్రాంతి పండుగకు ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణికులను అడ్డంగా దోచుకోవడం సర్వసాధారణం. పండగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి సాధారణ చార్జీలనే కొనసాగించింది. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీ నుంచి తప్పించుకున్నారు.

ప్రత్యేక సర్వీసుల ద్వారా 42.48 లక్షల ఆదాయం

జిల్లాలో నాలుగు డిపోల ద్వారా మొత్తం 160 ప్రత్యేక బస్సుల్ని హైదరాబాద్, విజయవాడ తదితర ప్రాంతాలకు తిప్పారు. మొత్తం నాలుగు డిపోల ద్వారా రూ.42.48 లక్షలు ఆదాయం లభించింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి పండుగకు జిల్లాకు వచ్చే వారికి నాలుగు డిపోల నుంచి పండుగ ముందు 89 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశారు. పండుగ ముందు ప్రత్యేక బస్సుల ద్వారా రూ 24.48 లక్షలు ఆదాయం రాగా పండగ తర్వాత తిరుగు ప్రయాణం కోసం 70 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయగా.. సుమారు రూ. 20 లక్షల ఆదాయం వచ్చింది. కొత్త జిల్లాలో మొదటి సంక్రాంతి పండుగ ఆర్టీసీకి మంచి ఆదాయం తీసుకొచ్చింది. గతేఏడాది శివరాత్రి నుంచి ఈ ఏడాది సంక్రాంతి వరకు ప్రతి పండుగకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తుంది. గతేడాది దసరాకు ప్రత్యేక సర్వీసుల ద్వారా రూ.25 లక్షల ఆదాయం లభించింది. ప్రత్యేక బస్సు సర్వీసుల్లో జిల్లాలోని భీమవరం డిపో మంచి ఆదాయం సాధించింది. భీమవరం డిపో రూ.9,87,671 సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. నర్సాపురం డిపో 28 బస్సుల ద్వారా రూ.7,45,914లతో రెండో స్థానంలో నిలిచింది.

డిపోల వారీగా సంక్రాంతి ఆదాయం

డిపో	ప్రత్యేక బస్సులు	ఆదాయం
భీమవరం	27	రూ.9,87,671
నర్సాపురం	28	రూ.9,45,914
తాడేపల్లిగూడెం	14	రూ.5,71,504
తణుకు	20	రూ.7,43,419

సంక్రాంతికి మంచి ఆదాయం



సంక్రాంతి పండుగకు ఆర్టీసీకి జిల్లా వ్యాప్తంగా మంచి ఆదాయం లభించడం సంతోషం. ప్రయాణికులు ఆర్టీసీ బస్సులను చక్కగా ఉపయోగించుకున్నారు. పండుగకు ముందు తర్వాత కూడా ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశాం. ధరలు పెంచకుండా సాధారణ ధరలకే సర్వీసు చేశాం.

– ఎం.వీరయ్య చౌదరి, ప్రజా రవాణా అధికారి, భీమవరం

క్లుప్తంగా

ఏపీ నిట్‌కు జాతీయ ప్రాజెక్టు మంజూరు



తాడేపల్లిగూడెం: కొత్త స్పింట్రోనిక్స్ పదార్థాలపై ప్రయోగాత్మకంగా పరిశోధనలు చేసేందుకు వీలుగా తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌కు జాతీయ ప్రాజెక్టు మంజూరైనట్లు నిట్ అధికారులు తెలిపారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ (ఫిజిక్స్) విభాగానికి ఈ ప్రాజెక్టు మంజూరైంది. ఈ విభాగానికి చెందిన సహాయ ఆచార్యులు డాక్టర్ తపస్ పర్మానిక్ పర్యవేక్షణలో ఈ ప్రాజెక్టు పనులు ముందుకు సాగనున్నాయి. అయస్కాంత, ఎలక్ట్రానిక్స్ లక్షణాలపై అధ్యయనం చేసేందుకు రూ.31.40 లక్షల విలువైన ప్రాజెక్టు దక్కింది. భారత ప్రభుత్వ ఆధీనంలోని సైన్సు అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు ఈ ప్రాజెక్టును మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టుపై ఇన్‌చార్జి డైరెక్టర్ దినేష్ పి.శంకర రెడ్డి మాట్లాడుతూ పరిశోధనలు దేశాభివృద్ధికి దిక్సూచీ వంటివి అన్నారు. నిట్‌లోని సహాయ ఆచార్యులు వరుసగా జాతీయ ప్రాజెక్టులు దక్కించుకోవడం శుభపరిణామమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రాజెక్టులను తీసుకురావడానికి ఆచార్యులు చేసిన కృషి శ్లాఘనీయమన్నారు.

8 మంది జూదరుల అరెస్టు

తణుకు: రైల్వేస్టేషన్ రోడ్డులోని నారాయణ కాలేజీ సమీపంలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది వ్యక్తులను బుధవారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ ముత్యాల సత్యనారాయణ చెప్పారు. నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.55,200 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఏలూరు కొత్తబస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు



విజయవాడ నాన్ స్టాప్, హైదరాబాద్ కౌంటర్ల వద్ద టికెట్ల కోసం బారులు తీరిన ప్రయాణికులు

మళ్లీ పండక్కి వస్తాం





బై తాత

దూర ప్రాంతాల నుంచి సంక్రాంతి పండుగకు సొంత గ్రామాలకు వచ్చి బంధువులు, స్నేహితులతో సరదాగా గడిపి ఆ తీపిజ్ఞాపకాలతో తిరిగి ప్రయాణమవుతున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండుగ మూడు రోజులూ ఆడిపాడి ఉల్లాసంగా గడిపిన వీరు తిరిగి మళ్లీ పండుగకు తిరిగొస్తామంటూ బై బై చెప్పి బయలుదేరుతున్నారు. ఏలూరులో బుధవారం ఇలా కొత్తబస్టాండ్‌లో కనిపించిన దృశ్యాలు ఇవి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



పండుగ ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్



మన ఊరు పోదాం

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

LEASE

Warehouse Available for Lease near Lanchester Road, Guntur, 16000 Sft. Space Situated on 7000 Sq. yards Land. Cont.: 8790205228. [HA-3268]

FLAT FOR SALE

Eluru: Manchem Apparao Nagar Beside Palagudem. 2BHK 2nd & 3rd Floor west facing (1005 Sft) and 1st, 2nd & 3rd Floor east (971 sft) facing Flats are for sale. Ph: 8340512162 [H-792775]

HOUSE FOR SALE

తణుకు ఇరగవరం రోడ్ కొమరవరం, దినకర స్పిన్నింగ్‌మిల్ ఎదురుగా వాసవీనగర్‌లో 100, 110, 120, 150, 202 చ॥గ॥లలో ఉన్న గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇండివిడ్యువల్ బిల్డింగ్స్ అమ్మకం. ఫోన్: 98855 00118, 98664 38104 [V-1701]

Services

GOLD FINANCE

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786661]

బంగారం బ్యాంకులలో కొనబడును. ముతూట్ మనప్పురం ఏ ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో ఈ రోజు రేట్ ప్రకారం కొనబడును. స్పాట్ క్యాష్. ✆ 88024 89999 [B-6045]

బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్ ✆ 99 12 72 1888 [B-1197726]

Wanted

ప్రముఖ బ్యాంక్‌లో పనిచేయుటకు Male సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జనరల్ షిఫ్ట్ 26వర్కింగ్ డేస్. వయస్సు 40 to 58, శాలరీ + ఇన్సెంటివ్ (7300/-), స్థలం: గోపాలపురం. ఫోన్ 95534 29991, 91826 46763. [V-6040]

హైదరాబాద్‌లోని ఆప్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretaker కావలెను. జీతం: 16-18 వేలు, భోజనం, వసతి, ఇన్సూరెన్స్ గలవు. 9381848549 / 6300813664 [G-350]

విజయవాడ గుంటూరులోని శ్రీమంతుల ఇండ్లలో పేషంట్స్‌ను చూసుకొనుటకు ఆడ, మగ స్టాఫ్ కావలెను. జీ: 15,000/- 25,000/- ఫ్రీ ఫుడ్ + రూమ్. సం॥ 7337313353, 9666442002 [G-776170]

షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-10046]

Vij శ్రీనిధి హోంకేర్ నందు పనికి ఆయాలు, వార్డు బాయ్స్, నర్సులు బేబీకేర్, ఇంటి/వంట పనికి స్త్రీ / పు॥లు కావలెను, జీతం : 13-50k, రూం+ మీల్స్. ఫోన్ : 9515019926, 7989776351. [HA-10818]

ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776041]

అంజన్న హోమ్‌కేర్ పెద్దవారికి పేషెంట్ కేర్/ఇంటి/వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్, Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661 [HA-900]



గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ట్రిపుల్ ఎఫ్ కర్మాగారంలో మహిళ దుర్మరణం

- పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు యంత్రాలలో పడి మృతి
- రూ.18 లక్షల పరిహారం అందించిన యాజమాన్యం



దేవళ్ల రమణమ్మ (ఫైల్)

పెంటపాడు: పెంటపాడు: ప్రత్తిపాడులోని ట్రిపుల్ ఎఫ్ కర్మాగారంలో బుధవారం ఉదయం బాయిలర్ కన్వేయర్ వద్ద ఊక వేసే క్రమంలో యంత్రాలలో పడి ఓ కార్మికురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కృష్ణాయపాలెంకు చెందిన దేవళ్ల రమణమ్మ (59) గత కొద్ది నెలలుగా ఈ కార్మాగారంలోని ఊక వెళ్లే మార్గంలో కన్వేయర్ బెల్టు వద్ద పనిచేస్తోంది. ఎప్పటిలాగానే బుధవారం పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కన్వేయర్ బెల్టుపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీనిపై తోటి కార్మికులు యాజమాన్యానికి సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని తాడేపల్లిగూడెం రూరల్ సీఐ మూర్తి పరిశీలించి మృతురాలిని కృష్ణాయపాలెంకు చెందిన రమణమ్మగా గుర్తించారు. ఈ ఘటనలో మృతురాలి కుటుంబానికి కర్మాగారం యాజమాన్యం రూ.18 లక్షలు చెల్లించినట్లు ఎస్సై జి.సత్యనారాయణ చెప్పారు. కాగా రమణమ్మ భర్త ఇటీవలే మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు కాగా, ఒక అల్లుడు వల్లూరి శ్రీను ఇదే ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనిని త్వరలో పర్మినెంట్ చేసేందుకు యాజమాన్యం అంగీకరించిందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కార్మికుల్లో భయాందోళనలు

పెంటపాడు: పెంటపాడులోని ట్రిపుల్ ఎఫ్ కర్మాగారంలో నెల వ్యవధిలోనే మరో వ్యక్తి మృతి చెందడం కార్మికులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది డిసెంబర్ 21న ఇదే కర్మాగారంలో భారీ విస్ఫోటనం సంభవించి ఓ వ్యక్తి సజీవదహనం అయిన సంఘటన ఇంకా మరువక ముందే బుధవారం తాజాగా కార్మికురాలు దేవళ్ల రమణమ్మ బాయిలర్ కన్వేయర్ వద్ద ఊక వేసే క్రమంలో యంత్రాలలో పడి మృతి చెందడం విచారకరం. యంత్రాల నిర్వహణ లోపమా, జాగ్రత్తలు తీసుకోవడంలో వైఫల్యమో తెలియడం లేదని కార్మికులు వాపోతున్నారు. ఇప్పటికైనా కార్మికులకు పనిభద్రత కల్పించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కార్మిక కుటుంబాలు కోరుతున్నాయి.

ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు



చిన్నారుల సంకీర్తనలు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59 వార్షిక మహోత్సవాల్లో బుధవారం ఏర్పాటు చేసిన పలు కళా ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బుధవారం సాయంత్రం 5 గంటలకు పోలవరపు హారిక కూచిపూడి నృత్య ప్రదర్శన, సాయంత్రం 6 గంటలకు మ్యూజికల్ నైట్, రాత్రి 8 గంటలకు శ్రీ షిర్డిసాయిబాబా మహాత్యం నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు కళా ప్రదర్శనలను తిలకించారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు..


వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సత్యదేవ అన్నమాచార్య బృందంచే అన్నమాచార్య కీర్తనలు, సాయంత్రం 5 గంటలకు పి.లక్ష్మీ లీలా భగవతారిణిచే హరికథ, సాయంత్రం 6 గంటలకు గొర్రెల రాము అండ్ పార్టీచే బుర్రకథ, రాత్రి 8 గంటలకు ఆకాశ ఆర్కెస్ట్రా వారిచే సినీ సంగీత విభావరి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

భార్య ఆత్మహత్యకు కారణమైన భర్తకు ఎనిమిదేళ్ల జైలు

తాడేపల్లిగూడెం (టీఓసీ)/తాడేపల్లిగూడెం అర్బన్: మానసిక, శారీరక వేధింపులకు గురిచేసి భార్య ఆత్మహత్యకు పాల్పడటానికి కారణమైన ఓ వ్యక్తి నేరం రుజువు కావడంతో అతనికి ఎనిమిదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తాడేపల్లిగూడెం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.ప్రకాష్‌బాబు బుధవారం తీర్పుని చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. అత్తిలి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన ఏసుదాసు కుమార్తె చిట్టి మరియమ్మను గణపవరం మండలం మెయ్యేరు గ్రామానికి చెందిన రాజుకు ఇచ్చి 20 ఏళ్ల క్రితం వివాహం చేశారు. భర్త, అత్తింటి వేధింపులు భరించలేక, అదనపు కట్నం ఇవ్వలేక మరియమ్మ 2018 మే 13న ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతిరాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు గణపవరం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో రాజు నేరం రుజువు కావడంతో సెక్షన్ 498 కింద ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా, ఐసీపీ సెక్షన్ 306 కింద ఏడేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధించారు. ఏపీపీ శిరిగినీడి విజయకృష్ణ ప్రాసిక్యూషన్ తరుపున వాదనలు వినిపించారు. గణపవరం సీఐ, ఎస్సై, కోర్టు కానిస్టేబుల్‌లు ప్రాసిక్యూషన్‌కు సహకరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ

- ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ
- రహదారి భద్రతా వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



రహదారి భద్రతా వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ, రవాణాశాఖ అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో పనిచేయాలని ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ అన్నారు. 34వ రహదారి భద్రతా వారోత్సవాలను చేపట్టేందుకు ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం పోలీస్, రవాణాశాఖ, ఏపీఎస్ఆర్‌టీసీ, ఆర్అండ్‌బీ, ఏలూరు నగరపాలక సంస్థ, రెడ్‌క్రాస్ తదితర శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రహదారి భద్రతా వారోత్సవాలను విజయవంతం చేసేందుకు సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రహదారి ప్రమాదాల్లో అత్యధికంగా యువత మృతి చెందుతున్నారని, వాహనాలను మితిమీరిన వేగంతో నడపటంతో ప్రమాదాలబారిన పడుతున్నారన్నారు. ఒకరు చేసే తప్పిదాలతో ఇతరులు సైతం శిక్షలు అనుభవించే పరిస్థితి ఏర్పడిందన్నారు. రహదారి ప్రమాదాల కారణంగా వీరిపై ఆధారపడిన కుటుంబాలు నిరాదరణకు గురై తీవ్ర కష్టాలను అనుభవిస్తున్నారని, వాహనాలు నడిపే సమయంలో కుటుంబ సభ్యులను, వారిపై ఆధారపడిన వారిని గుర్తుచేసుకుంటూ జాగ్రత్తగా ప్రయాణించాలని కోరారు. ఈనెల 18వ తేదీ నుంచీ 24వ తేదీ వరకూ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. వారోత్సవాల ప్రారంభం సందర్భంగా బుధవారం వారోత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, ఎస్‌బీ సీఐ వి.రవికుమార్, డీసీఆర్‌బీ సీఐ ఎం.సుబ్బారావు, ఏలూరు ఆర్‌టీవో కే.శ్రీహరి, మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ కే.విజయరాజు, అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్స్‌పెక్టర్ జీ.స్వామి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కే.ధనలక్ష్మి, ఏవో ఎం.రాము, సూపరింటెండెంట్ జీవీ భాస్కరరావు, ఆర్అండ్‌బీ డిప్యూటీ సూపరింటిండెంట్ ఎం.హరికృష్ణ, ఏలూరు నగరపాలక సంస్థ డీఈఈ తాతబాబు, ఏపీఎస్ఆర్‌టీసీ ప్రతినిధి కేఎల్‌వీ నరసింహం, రెడ్‌క్రాస్ సెక్రటరీ బీ.బెన్నీ, జిల్లా ట్రాఫిక్ రికార్డ్ బ్యూరో ఎస్ఐ కే.రాంబాబు, డీటీఆర్‌బీ సిబ్బంది ఉన్నారు.

ఇంటింటికీ సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్ : కడియద్ద గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెనుమంట్ర: పెనుమంట్రలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా అంటూ ఓ దివ్యాంగుడ్ని అడిగి తెలుసుకుంటున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

1.18 లక్షల పశువులకు లంపీ టీకాలు

- జిల్లాలో 98 శాతం లక్ష్యం పూర్తి
- పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు వెల్లడి



ఏలూరు (టూటౌన్): తెల్ల పశువుల్లో వచ్చే లంపీ వైరస్ (ముద్ద చర్మ) వ్యాధిని అరికట్టేందుకు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 1.18 లక్షల పశువులకు లంపీ వైరస్ నిరోధక టీకాలు వేసినట్లు పశుసంవర్థక శాఖ జేడీ జి.నెహ్రూబాబు చెప్పారు. గురువారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఈ వ్యాధి ముఖ్యంగా తెల్ల పశువుల్లో, అక్కడక్కడా గేదెలు వంటి వాటికి కూడా లక్షణాలను బట్టి ఈ టీకాలను అందజేస్తున్నామన్నారు. అవసరమైతే మరిన్ని డోసులు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ వ్యాధి నివారణ కోసం ప్రభుత్వం ఏలూరు జిల్లాకు 1.20 లక్షల డోసుల టీకాలను సరఫరా చేయగా, వీటిలో ఇప్పటివరకు మొత్తం 1.18 లక్షల టీకాలు వేశామన్నారు. వీటిలో 1.09 లక్షలు ఆవులు ఉండగా ఇప్పటివరకు 1.07 లక్షల ఆవులకు టీకాలు వేసినట్లు తెలిపారు. వీటితో పాటు వైరస్ లక్షణాలు కనిపించిన 11,641 గేదెలకు కూడా టీకాలు వేసినట్లు వివరించారు. వైరస్ నివారణలో భాగంగా పట్టణ ప్రాంతాల్లోని వీధి పశువులకు ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. అయితే కొన్ని పశువుల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉండటంతో టీకాలు వేసినప్పటికీ వ్యాధి లక్షణాలు కనిపించినా దాని తీవ్రత పెద్దగా ఉండదన్నారు. ముద్ద చర్మ వ్యాధి తెల్ల పశువుల్లో ఎక్కువగా కనిపిస్తుందని, దీంతో యజమాని ఆందోళన చెందకుండా నివారణ చర్యలు చేపట్టాలని జేడీ సూచించారు. వ్యాధి సోకిన పశువులకు నాలుగైదు రోజుల పాటు యాంటీ బయోటిక్, యాంటీ హిస్టమిన్ మందులను వాడితే పశువులకు ఉపశమనం కలుగుతుందన్నారు. ఈ వ్యాధి వల్ల తీవ్రమైన నష్టం లేనందున పశుపోషకులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. వ్యాధి సోకిన పశువులను ఆరోగ్యంగా ఉన్న పశువుల నుంచి వేరు చేసి దూరంగా ఉంచి మేత, నీరు పెట్టి తగిన చికిత్స అందించాలని వివరించారు.

ముగిసిన జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



ఫైనల్‌లో తలపడుతున్న ఆంధ్రా, హర్యానా జట్లు

నరసాపురం: రుస్తుంబాదలో గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న జాతీయ స్థాయి 28వ ఇన్విటేషన్ కప్ పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. పురుషుల విభాగంలో ఆంధ్రా జట్టు, మహిళల విభాగంలో హర్యానా జట్టు విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగంలో వెస్ట్ బెంగాల్ రెండో స్థానంలో, రాజస్థాన్ మూడో స్థానంలో, జమ్మూ అండ్ కాశ్మీర్ నాలుగో స్థానంలో నిలిశాయి. మహిళల విభాగంలో ఆంధ్రా జట్టు రెండో స్థానంలో, ఛండీఘర్ మూడో స్థానంలో, కేరళ నాలుగో స్థానంలో నిలిచాయి. ఫైనల్ మ్యాచ్‌లను తిలకించడానికి పెద్ద ఎత్తున ప్రేక్షకులు హాజరయ్యారు. దీంతో స్టేడియం కిక్కిరిసింది. నరసాపురం సబ్‌కలెక్టర్ ఎం.సూర్యతేజ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటి బహుమతిగా రూ.1 లక్ష, రెండో బహుమతిగా రూ.75 వేలు, మూడో బహుమతిగా రూ.50 వేలు, నాలుగో బహుమతిగా రూ.25 వేలు చొప్పున మొత్తం రూ.5 లక్షల ప్రైజ్‌మనీ, కప్పులను విజేతలకు సబ్‌కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. పోటీల నిర్వాహకులు మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, మాజీ ఎమ్మెల్యే కొత్తపల్లి జానకీరామ్, వన్నెంరెడ్డి శ్రీనివాస్, గుగ్గిలపు మురళీ, మాజీ ఏఎంసీ చైర్మన్ దొండపాటి స్వాములు, రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు పీఎస్ఎన్ మూర్తి పోటీలు పర్యవేక్షించారు.

క్లుప్తంగా

జగన్ సేవాదళ్ కన్వీనర్‌గా సంపతరావు



ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణను సన్మానిస్తున్న జగన్ సేవాదళ్ కన్వీనర్ సంపతరావు

పెంటపాడు: పెంటపాడు మండల జగన్‌సేవాదళ్ కన్వీనర్‌గా విప్పర్రు గ్రామానికి చెందిన రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలోని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో కృష్ణారావు మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. తనపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ ఉన్నతికి నిరంతరం కృషిచేస్తానని ఈ సందర్భంగా కృష్ణారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, ఏఎంసీ వైఎస్ చైర్మన్ జామి కృష్ణ, పెంటపాడు ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మవారి చీరకు 2.25 కిలోల వెండి అందజేత



ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా వెండిని అందజేస్తున్న దాతలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలమ్మవారి వెండి చీర నిమిత్తం పలువురు దాతలు ముందుకొచ్చి 2.25కిలోల వెండిని అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన బాదరాల సుబ్బారావు కిలో వెండి, మేడిశెట్టి శ్రీనివాస్ పావు కిలో, మాదిరెడ్డి మురళీకృష్ణ కిలో వెండిని అందజేసిన వారిలో ఉన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చేతుల మీదుగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మాకా బాలాజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, ఆలయ కమిటి సభ్యులు సత్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు



యానాలపల్లి గ్రామంలో ర్యాలీ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెంటపాడు: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పెంటపాడు మండలం యానాలపల్లి, పరిమెళ్ల గ్రామాల్లో బుధవారం ఆరోగ్యశాఖ సిబ్బంది రోగాలపై అవగాహన, డ్రైడే ఆవశ్యకతను వివరించారు. దోమల తెరల వాడకం, దోమల నివారణ, డ్రైనేజీల శుభ్రత, పరిసరాల శుభ్రత, డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పరిమెళ్ల సర్పంచ్ గొర్రెల వెంకట కోటేశ్వరరావు, కార్యదర్శి నాగదేవి, ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి మహంకాళమ్మ జాతర మహోత్సవాలు



అంబికా డ్యాన్స్ అకాడమి వారిచే కూచిపూడి నృత్యాలు చేస్తున్న చిన్నారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని కొబ్బరితోట శ్రీదేవి మహంకాళమ్మ తల్లి జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి మహంకాళమ్మ ఉత్సవాల వేదికపై అనేక ప్రదర్శనలు ఇచ్చి, అవార్డులు పొందిన అంబికా డ్యాన్స్ అకాడమి వారిచే కూచిపూడి జానపదం, రింగ్ ఫ్యూజన్ ప్రదర్శనలు జరిగాయి. పలు ప్రదర్శనలు అహుతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెగ్గిన నాగబాబు పర్యవేక్షించారు.

ముగిసిన ముత్యాలమ్మ జాతర ఉత్సవాలు

పెంటపాడు: పెంటపాడు మండలం ఆకుతీగపాడు, బోడపాడు గ్రామాల్లో రెండేళ్లకు ఒకసారి నిర్వహించే ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాలు ముగిసాయి. జాతర ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి గ్రామోత్సం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వివక్ష లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- కడియద్ద గ్రామంలో గడపగడపకు మనప్రభుత్వం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజలందరికీ మేలు జరగాలంటే మళ్లీ సీఎం జగన్ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కడియద్ద గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, సచివాలయ వ్యవస్థ పనితీరును ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సీఎం జగన్ పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. అయితే ప్రజలు బాగుంటే పవన్‌కు నచ్చడం లేదన్నారు. చంద్రబాబు బాగుంటేనే తాను బాగుంటానని పవన్ భావిస్తున్నాడని వ్యాఖ్యానించారు. చంద్రబాబు నిలువెత్తు విషమైతే... పవన్ నిలువెత్తు మోసమని ఘాటుగా విమర్శించారు. గతంలో చంద్రబాబు తిరిగి ముఖ్యమంత్రి అయిన తర్వాతే అసెంబ్లీలో అడుగు పెడతానని శపథం చేశారన్నారు. ఈ క్రమంలో పవన్ చంద్రబాబును సీఎం చేస్తారా ? అని ప్రశ్నించారు. సినిమా తీస్తే రూ.150 కోట్లు మాత్రమే వస్తుందని, చంద్రబాబును సీఎం చేస్తే ప్రతి మూడు నెలలకు ప్యాకేజీ వస్తుందని తహతహలాడుతున్నారన్నారు. ఎవరి స్వార్థం వారు చూసుకుంటున్నారే తప్ప ప్రజల శ్రేయస్సును పవన్, చంద్రబాబులు ఆకాంక్షించడం లేదన్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో కుల,మత, రాజకీయాలకతీతంగా అన్నివర్గాలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. ఈ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ప్రజల్ని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, గ్రామ సర్పంచ్ యాతం కోటీశ్వరి, ఎంపీపీ పానుకుమాటి శేషులత, చినతాడేపల్లి సర్పంచ్ పిచ్చికల రాజారావు, ఎమ్పీటీసీ నార్ని శంకరరావు, మార్లపూడి సుబ్బారావు, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్రకుమార్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, పార్టీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, కొల్లా విజయలక్ష్మికుమారి, వైఎస్సార్‌సీపీ మండల సేవాదళ్ చైర్మన్ కొండుబోయిన కృపావరం, పరిమి వెంకటేశ్వరరావు, దారపురెడ్డి శ్రీనివాస్, తహసీల్దార్ వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, హౌసింగ్‌డీఈ కేవీవీఎస్.సత్యప్రసాద్, వ్యవసాయ శాఖ అధికారి ఆర్ఎస్.ప్రసాద్, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, ఏపీవో ఏవీవీఎస్‌వి.ప్రసాద్, హౌసింగ్ ఏఈ వైవి.వెంకట్రావు, సచివాలయ కార్యదర్శి పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి శేషగిరిరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ



నూతన డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని బుధవారం పెన్షనర్స్ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు బి.హరికుమార్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డైరీలో పెన్షనర్లుకు సంబంధించి ఉపయోగపడే అనేక అంశాలను, ప్రభుత్వ జీవోలను పొందుపరిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైవీఎస్ మూర్తి, కె.బాలకృష్ణ, వీకే వీరారావు, ఎం.అర్జున రావు, కె.సత్యనారాయణ, ఎండీ ముస్తాఫా, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, బి,సత్యనారాయణ రాజు, వి.రామ్మోహన్‌రావు, పీవీ నారాయణ రావు, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ఆకుతీగపాడులో మాట్లాడుతున్న వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్

పెంటపాడు: రైతు సంక్షేమమే వైసీపీ ప్రభుత్వ ధ్యేయమని జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆకుతీగపాడులో పొలంబడి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆకుతీగపాడులో జిల్లా వ్యవసాయ శాఖాధికారి (డీఈవో) జెడ్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కై గాల మాట్లాడారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ప్రతి రైతూ పొలంబడి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొనేలా చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. వ్యవసాయాన్ని పండగ చేసేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు.. ధాన్యం కొనుగోలు, సొమ్ముల చెల్లింపుల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా పలు చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పార్థసారధి, ఏడీఏ మురళీకృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సుకు సీఎం కృషి



పుల్లాయగూడెం గ్రామంలో వైఎస్సార్ జలకళలో బోరు వేసిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగ శ్రేయస్సు కోసం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సహకారంతో వైఎస్సార్ జలకళ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పుల్లాయగూడెం గ్రామంలో సన్నకారు రైతులకు బుధవారం బోరు వేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులకు వైఎస్సార్ జలకళ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఇద్దరు, ముగ్గురు రైతులు కలిసి బోరు వేసుకునే సౌలభ్యం ఉందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చీకట్ల పుష్పలక్ష్మీకుమారి, చీకట్ల మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధులకు దుస్తులు అందజేత



పెదగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో వస్త్రాలు బహూకరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మండలంలోని పెదగరువు ప్రాథమిక పాఠశాల ఆవరణలో మంతెన అప్పారావు జ్ఞాపకార్థం గ్రామంలోని 65 మంది వృద్ధులకు బుధవారం నూతన వస్త్రాలు బహూకరించారు. గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తణుకులో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

తణుకు: పట్టణంలోని చిట్టూరి ఇంద్రయ్య ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1994–97 ఏడాదిలో బీకామ్ చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. స్థానిక పద్మశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల్లో అయా రంగాల్లో స్థిరపడిన వారంతా కలిసి పాత జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను ఘనంగా సత్కరించారు. తమతోపాటు చదవుకున్న టీవీ, సినిమా నటుడు ఆకెళ్ల గోపాలకృష్ణను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పుప్పాల ప్రసాద్, వెంకటేశ్వర్లు, మన్యం అప్పారావు, సలీం, కృష్ణచౌదరితోపాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ప్రతి ఇంటికీ ఉచిత విద్యుత్ కనెక్షన్

- తాళ్లకోడులో 793 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు
- ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు



కుప్పనపూడి శివారు తాళ్లకోడులో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఆకివీడు : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న లబ్ధిదారులందరికీ ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ప్రభుత్వం ఇస్తోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహారాజు చెప్పారు. కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పీవీఎల్ నర్సింహారాజు మాట్లాడుతూ తాళ్లకోడు కాలనీలో 3,150 ఇళ్ల నిర్మాణానికి అనుమతి మంజూరు కాగా ఇప్పటికే 203 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 590 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. కాలనీలో 40కి పైగా ట్రాన్స్‌పార్మర్లు, ఒక సబ్ స్టేషన్ నిర్మించనున్నట్లు చెప్పారు. లబ్ధిదారులందరికీ ఉచితంగా సర్వీస్ వైర్, మీటరు, బోర్డు అందజేస్తున్నామన్నారు. కనెక్షన్‌కు చెల్లించాల్సిన డిపాజిట్ కూడా ఉచితమేనని పీవీఎల్. నర్సింహారాజు చెప్పారు. మిగిలిన ప్రాంతాల్లోని లబ్ధిదారులు కూడా వేగంగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, ఉచిత కనెక్షన్ పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, వైస్ చైర్మన్ వంగా జ్యోత్స్న, పుప్పాల పండు, ఎంపీటీసీ బంటుమిల్లి పుణ్యవతి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు, కౌన్సిలర్లు మోటుపల్లి కుమారి, నిమ్మల నాగు, ఎండీ. జక్కీ, మాజీ జెడ్పీటీసీ మన్నే పోతరాజు, షేక్ హుస్సేన్, మోటుపల్లి రాజు, పీ.వెంకన్న, నాగరాజు, విద్యుత్ డీఈ పీర్ అహ్మద్ ఖాన్, ఏడీ రాంబాబు, ఏఈ ప్రసాదరాజు పాల్గొన్నారు.

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



మండలంలోని లోసరిలో క్రికెట్ టోర్నమెంట్ విజేతకు బహుమతి అందిస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సర్పంచ్ జల్లా కొండయ్య అన్నారు. భీమవరం మండలంలోని లోసరి గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సర్పంచ్ జల్లా కొండయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటి రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రఖ్యాతలు తీసుకువస్తున్నారన్నారు. క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా ఉద్యోగాలు కల్పిస్తుందని విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ప్రతి రోజు ఒక గంట పాటు క్రీడలు ఆడటం వల్ల ఒత్తిడి దూరమై మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో 8 టీములు పాల్గొన్నాయి. తిరుమాని దుర్గరాజు కెప్టెన్‌గా ప్రాతినిథ్యం వహించిన టీం ప్రథమ బహుమతి రూ. 10 వేలు, షీల్డ్ గెలుపొందారు. కొల్లాటి సురేష్ కెప్టెన్‌గా ప్రాతినిథ్యం వహించిన టీం ద్వితీయ బహుమతిగా రూ. 5 వేలు, షీల్డ్ అందుకున్నారు.అందించారు. ఈ కార్యక్రమంలో ఒడుగు నారాయణమూర్తి, మోకా రాజు, జల్లా నారాయణమూర్తి, తిరుమాని కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధార్ ఈకేవైసీపై పెన్షనర్లకు అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు జీఓ నెంబర్ 7 ప్రకారం ప్రతి ఉద్యోగి, ప్రభుత్వ పెన్షనర్లు, ఇతరులు పే రోల్ హెర్బ్ పోర్టల్‌లో ఆధార్ ఈకేవైసీ చేయించుకోవాలని ఉప ఖజానాధికారి జయ దత్తేశ్వరరావు అన్నారు. పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయంలో ఖజానాధికారి ఆధ్వర్యంలో పెన్షనర్లకు, ఇతర ఉద్యోగులకు ఈకేవైసీపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దత్తేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు సకాలంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా పూర్తిగా పారదర్శకంగా వారి ఖాతాల్లో జమ చేయుట కోసం తప్పనిసరిగా ఆధార్ ఈ-కేవైసీ చేయించుకోవాలని కోరారు. పూర్తి చేయడంలో లోపాలు ఉంటే ఉప ఖజానా కార్యాలయం అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాలూకా అధ్యక్షులు బి.హరికుమార్, దత్తు, పెన్షనర్లు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైళ్లమ్మ జాతర ప్రారంభం



పైళ్లమ్మ జాతరలో పాల్గొన్న సర్పంచ్ వెంకటసోమరాజు, గ్రామ పెద్దలు

ఉండి : ప్రసిద్ధిగాంచిన చిలుకూరు పైళ్లమ్మ అమ్మవారి జాతర ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఆలయ చైర్మన్, గ్రామ సర్పంచ్ ముదునూరి వెంకటసోమరాజు ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ జాతరను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. బుట్టబొమ్మలు, కళారూపాలు, తీన్‌మార్, డప్పువాయిద్యాలు, గరగ నృత్యాలు, మందుగుండు కాల్పులతో జాతర సందడిగా సాగింది. గ్రామస్తులతోపాటు పరిసర గ్రామ ప్రాంత ప్రజలు ఈ జాతర మహోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర ముగింపు గురువారం నిర్వహించనున్న అఖండ అన్నసమారాధనకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు చేకూరి శ్రీనివాసరాజు (బోసురాజు), ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మంతెన వెంకటనర్సింహరాజు, రుద్రరాజు బలరామరాజు, వేగేశ్న దిలీప్‌రాజు, పెన్మెత్స భీమరాజు, అల్లూరి వెంకట్రాజు(బుజ్జి), బుచ్చిరాజు శ్రీనురాజు, ఫణీ, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శాంతికి పీహెచ్‌డీ



పీహెచ్‌డీ పొందిన శాంతిని అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న గొట్టుముక్కల శాంతికి ఆంధ్ర యూనివర్సిటీ అప్లైడ్ మ్యాథమెటిక్స్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేసిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జగపతిరాజు చెప్పారు. బుధవారం కళాశాలలో యాజమాన్యం తరఫున శాంతిని కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్ రంగరాజు, జగపతి రాజును ఘనంగా సత్కరించిన సందర్భంగా జగపతిరాజు వివరాలను వివరించారు. ఆంధ్ర యూనివర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ టి లింగరాజు, జాయింట్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ సీయస్ బి రావు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ దక్కిందన్నారు. అనంతరం శాంతిని విఠల్‌రంగరాజు, జగపతిరాజు, డి వెంకటపతిరాజు తదితరులు అభినందించారు.

'శత గీత రసగుళికలు' పుస్తకావిష్కరణ



శత గీత రసగుళికల పుస్తకావిష్కరణ దృశ్యం

పాలకోడేరు : ప్రముఖ రచయిత మంతెన అచ్యుత రామరాజు రచించిన శత గీత రసగుళికలు పుస్తకావిష్కరణ మంగళవారం రాత్రి కోరుకొల్లులో నిర్వహించారు. భీమవరానికి చెందిన ప్రముఖ వైద్యుడు పీఆర్‌కె వర్మ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. తన తల్లిదండ్రులు మంతెన నర్సింహరాజు, లీలావతమ్మకు ఈ పుస్తకాన్ని రచయిత మంతెన అచ్యుతరామరాజు అంకితం చేశారు. వంద గీతాలు రచించి ప్రథమ ముద్రణ చేసి ప్రముఖుల చేత ఆవిష్కరించిన రచయితకు ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా సినీ ఆరిస్ట్ శ్రీనివాస్ వ్యవహరించగా, సర్పంచ్ మంతెన భారతి, రాష్ట్ర అటవీ శాఖ అభివృద్ధి డైరెక్టర్ మంతెన యోగీంద్రకుమార్ (బాబు), ఉప సర్పంచ్ చంటిరాజు, పెన్మెత్స సీతారామరాజు, మాజీ సర్పంచ్ /మంతెన లక్ష్మీ నర్సింహరాజు, నారాయణరాజు, మంతెన శ్రీనివాస్, సుందర్, పెన్మెత్స గీత, మ్యూజిక్ డైరెక్టర్ నరైన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యంపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన కె.ఏడుకొండలు కుమార్తె ఈ నెల 13న ఇంటి నుంచి బయటకు వెళ్లి మళ్లీ తిరిగి రాలేదని స్నేహితులు, బంధువులు ఇళ్ల వద్ద ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించక లేదని తండ్రి కొల్లాడి ఏడుకొండలు పోలీసులకు ఫిర్యాదు అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ పి. ఉమామహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి : ఉండి మండలం కోలమూరు ఆక్వా చెరువులపై నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై మంగళవారం అర్ధరాత్రి ఎస్సై కె.గంగాధరరావు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 15 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.02 లక్షలు నగదును స్వాధీనం చేసుకుని, వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

భార్యా పిల్లలపై పెట్రోలు పోసి నిప్పంటించిన భర్త అరెస్టు

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని అనాకోడేరులో మంగళవారం భార్య పిల్లలపై పెట్రోలు పోసి నిప్పంటించిన భర్త తానింకి సురేష్‌ను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని రిమాండ్‌కు పంపించినట్లు ఎస్సై వి. అప్పలరాజు తెలిపారు.

విచక్షణ రహితంగా ఎరువులు చల్లవద్దు

యలమంచిలి: వరి సాగులో రైతులు విచక్షణ రహితంగా ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేయవద్దని మండల వ్యవసాయాధికారి చిండులూరి దేవి రైతులను కోరారు. యలమంచిలిలో బుధవారం ఆమె పర్యటించి వరి చేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడుతూ అవసరం మేరకే ఎరువులు వాడాలని చెప్పారు. రైతులు సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సేంద్రీయ వ్యవసాయ సాగు కారణంగా పెట్టుబడి తగ్గడమే కాకుండా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు వస్తాయన్నారు. తద్వారా ప్రజల జీవన ప్రమాణం పెరుగుతుందన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొందని ఫిర్యాదు

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్‌లోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నడిచి వెళ్తుండగా తనను గుర్తు తెలియని ద్విచక్రవాహనం ఢీకొందని కె.వెంకట బాలాజి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 10న ఘటన జరగగా బుధవారం ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎస్.సత్యసాయి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారన్నారు.